
సచివాలయాలపై కూటమి కుట్రలు

- విలీనం కానున్న సచివాలయాలు
- కసరత్తులో నిమగ్నమైన అధికారులు
- ప్రజలకు దూరం కానున్న సేవలు



ధర్మవరం రూరల్: గ్రామ సచివాలయాలను నిర్వీర్యం చేయడానికి కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకురావడానికి గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. 2 వేల జనాభాకు ఒక్క సచివాలయం చొప్పున ఏర్పాటు చేసి గ్రామస్థాయిలోనే ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే ఈ వ్యవస్థను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకురావడంతో ఆ పార్టీకి పేరొస్తుందన్న ఉద్దేశంతో వాటిని నిర్వీర్యం చేయడానికి కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. అందులో భాగంగా సచివాలయ ఉద్యోగులను ఎక్కడ పడితే అక్కడకు బదిలీ చేశారు.

ఇక నుంచి ఉన్న ఊర్లలో సేవలు అందవు

సచివాలయాలను విలీనం చేయనుండడంతో వివిధ రకాల సేవల కోసం ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఉన్న ఊర్లలోనే సేవలు పొందే ప్రజలు ఇకపై వేరే ఊర్లకు వెళ్లాల్సిన పరిస్థితులు త్వరలో ఏర్పడనున్నాయి. పనులు మానుకొని సచివాలయాలకు వెళ్లినా అక్కడ సిబ్బంది వుంటారా లేక విధి నిర్వహణలో ఫీల్డ్‌కు వెళతారో తెలియని పరిస్థితి నెలకొంటుంది. గత ప్రభుత్వ హయాంలో ఉన్న ఊర్లలోనే పనులు చేసుకొని తీరిగ్గా సచివాలయాల్లో సేవలు పొందే వాళ్లమని గుర్తు చేసుకుంటున్నారు.

తగ్గనున్న ఉద్యోగుల సంఖ్య

సచివాలయాల్లో 11 మంది ఉద్యోగులు ఉన్నచోట వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేసి కుదించే చర్యలు జరుగుతున్నాయి. వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వీఆర్‌ఓ, కార్యదర్శి, వ్యవసాయం, వెటర్నరీ, ఏఎన్‌ఎం, మహిళా పోలీస్ తదితరులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ ఉద్యోగుల్లో ప్రధానంగా వెల్ఫేర్, వీఆర్‌ఓ, కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్‌తో మొత్తం 9 మంది మాత్రమే పని చేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. మిగిలిన ఉద్యోగులను ఆయా శాఖలకు బదలాయించేందుకు కసరత్తు చేస్తున్నారు.

మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలకు వెళ్లకుండా..

సచివాలయ వ్యవస్థతో మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలకు వెళ్లకుండా గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండేవి. దాదాపు 530 రకాల సేవలు సకాలంలోనే అందుతుండేవి. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల పల్లె ముంగిట ప్రభుత్వ సేవలు దూరం కానున్నాయి. ఇకపై రెండు సచివాలయాలను కలిపి ఒక సచివాలయంగా ఏర్పాటు చేసేందుకు అధికారులు క్షేత్ర స్థాయిలో కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఎంపీడీఓలు, కార్యదర్శులు సచివాలయాల కుదింపు ఎలా చేయాలనే దానిపై విస్తృతంగా సంప్రదింపులు జరుపుతున్నారు. రెండు సచివాలయాలు ఉన్నచోట ఒకటి చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కొన్ని చోట్ల ఒక్క గ్రామానికే సచివాలయాలు ఏర్పాటయ్యాయి. వాటిని సమీపంలోని మరొక సచివాలయానికి అనుసంధానం చేయనున్నారు. కొన్ని చోట్ల సచివాలయాలు లేకుండా చేస్తే ప్రజలు మరో గ్రామానికి సేవల కోసం వెళ్లాల్సి వస్తుంది. అలాంటి వాటిని ఎలా చేయాలనే దానిపై అధికారులు మల్లాగుల్లాలు పడుతున్నారు. ధర్మవరం నియోజకవర్గంలో 60 గ్రామ సచివాలయాలున్నాయి. అయితే వాటిని సగానికి తగ్గించనున్నారు.

ధర్మవరం నియోజకవర్గంలో గ్రామ సచివాలయాల వివరాలు..

మండలం	గ్రామ సచివాలయాల సంఖ్య
ధర్మవరం	14
తాడిమర్రి	14
బత్తలపల్లి	11
ముదిగుబ్బ	21

గ్రామస్థాయిలోనే అన్ని పనులు జరిగేవి



గత ప్రభుత్వం గ్రామాల్లోనే ప్రజలకు సేవలు అందించేందుకు గ్రామ సచివాలయాలను నిర్మించింది. అన్ని సేవలు వాటి ద్వారా అందేవి. ఇక నుంచి సచివాలయాలను మూసేస్తారని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. అలా జరిగితే పనులు కోసం పక్క గ్రామాలకు వెళ్లాల్సి వస్తుంది. విలీనం నిర్ణయాన్ని విరమించుకుంటే మంచిది.

– రమేష్, ఏలుకుంట్ల

విలీనంపై కసరత్తు



ధర్మవరం మండలంలో 14 గ్రామ సచివాలయాలున్నాయి. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు వాటిని కుదించడానికి కసరత్తు చేస్తున్నాం. అందులో భాగంగా 14 గ్రామ సచివాలయాలను 7 గ్రామ సచివాలయాలుగా ఏర్పాటు చేయడానికి నివేదికలను రూపొందిస్తున్నాం. పై అధికారుల ఆదేశాల మేరకు ఏఏ గ్రామ సచివాయాలుంటాయో త్వరలో ప్రకటిస్తాం.

– సాయి మనోహర్, ధర్మవరం ఎంపీడీఓ

క్లుప్తంగా

వడదెబ్బపై అప్రమత్తత అవసరం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: ప్రతి ఒక్కరూ వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ జ్యోత్స్న పేర్కొన్నారు. గురువారం బత్తలపల్లి ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో పర్యటించిన ఆమె విద్యార్థులకు వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో మధ్యాహ్న సమయంలో బయట తిరగకూడదన్నారు. కూలీలు, రైతులు, గొర్రెల కాపర్లు ఎండలో తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు పాఠశాల వదిలిన అనంతరం ఇంట్లోనే ఉండాలన్నారు. తరచూ నీళ్లు, ఓఆర్‌ఎస్ ద్రావణం, కొబ్బరినీళ్లు తాగాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నగేష్, హెచ్‌ఎం లక్ష్మీపతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఒకరికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన బాధితుడు పెద్దిరాజు

తాడిమర్రి: దాడితోట గ్రామ సమీపంలో మల్లప్పస్వామి గుడి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం తురకవారిపల్లి గ్రామానికి చెందిన ఆర్వేటి పెద్దిరాజు గురువారం ఉదయం స్కూటర్‌పై అనంతపురం బయలుదేరాడు. దాడితోట గ్రామ సమీపంలో బైపాస్ రోడ్డు వద్దకు రాగానే అదాని గ్రీన్ ఎనర్జీ కంపెనీ బొలెరో వాహనం స్కూటర్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో పెద్దిరాజుకు కాలు, చేయి విరగ్గా వాహనం ధ్వంసమైంది. అదాని కంపెనీ సిబ్బంది, స్థానికులు వెంటనే అతడిని వాహనంలో అనంతపురంలోని ప్రయివేటు ఆసుపత్రిలో చేర్పించారు. రామాపురం సర్పంచ్ కుంటాల పుల్లయ్య ఆసుపత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు.

జాబితాలో పేరున్న వారే ఈ- కేవైసీ చేయించుకోవాలి

గాండ్లపెంట: డీలర్లకు ఇచ్చిన జాబితాలో పేరున్న వారే మాత్రమే ఈ- కేవైసీ చేయించుకోవాల్సి ఉందని సీఎస్‌డీటీ వాణిబాయి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కొంత మంది డీలర్లు కార్డుదారులందరితో ఈ-కేవైసీ తీసుకుంటున్నారని తెలిసిందన్నారు. జాబితా మేరకు ఈ-కేవైసీ తీసుకోవాలని డీలర్లకు తెలియజేశారు. ఐదేళ్ల వయసు కలిగిన వారికి తొలుత ఆధార్ అప్‌డేట్ చేయించాలని అప్‌డేట్ అయిన పిల్లలకే ఈ-కేవైసీ అవుతుందని తెలిపారు. ఒకవేళ ఐదేళ్ల పిల్లలకు ఈ-కేవైసీ రాని పక్షంలో రిమార్కులో చూపాలని డీలర్లకు సూచించారు.

సమస్యలపై ఉద్యమిద్దాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీనుగ నాగరాజు

రామగిరి: ప్రజా సమస్యలపై ఉద్యమిద్దామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీనుగ నాగరాజు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని నసనకోట పంచాయతీలోని ఎగువపల్లి, కొత్త గ్యాదికుంట, పీఆర్ కొట్టాల, ముత్యాలంపల్లి, మాదాపురం, గంగంపల్లి గ్రామస్తులతో సమావేశమయ్యారు. గ్రామ కమిటీలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ శ్రమించాలని తెలిపారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు పోరాడదామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బండారు అనిల్‌కుమార్, రామలింగారెడ్డి, మల్లయ్య, జగదీష్, ముత్యాలు, మధు, దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

తనకల్లు: మండలంలోని పరాకువాండ్లపల్లి వద్ద ఉన్న జాతీయ రహదారి-42 పై గురువారం జరిగినరోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు..తనకల్లుకు చెందిన కులదీప్ తన బంధువులైన నితిన్, ఫణీంద్రతో కలిసి కదిరి నుంచి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. అయితే గ్రామం సమీపంలోకి రాగానే మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో రోడ్డు పక్కను ఉన్న రాళ్ల గుట్టపై పడ్డారు. ఈ ప్రమాదంలో కులదీప్ తీవ్రంగా గాయపడ్డాడు. నితిన్, ఫణీంద్ర స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు, వందేమాతరం టీం సభ్యులు క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కులదీప్‌కు అనంతపురం, నితిన్‌ను కదిరికి తీసుకెళ్లారు.

వైఎస్సార్‌సీపీని బలోపేతం చేద్దాం



ముక్తాపురం గ్రామ అధ్యక్షుడు ఓబిలేసును సన్మానిస్తున్న దృశ్యం

కనగానపల్లి: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎంగా చేసుకోవాలి. గ్రామాల్లో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేద్దామని ఆ పార్టీ జిల్లా యూత్ విభాగం అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని ముక్తాపురం, మామిళ్లపల్లి, దాదులూరు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ నాగముని, మండల నాయకులు స్థానిక గ్రామాల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశారు. పార్టీ కమిటీల నియామకంపై చర్చించారు. గ్రామాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేసే పార్టీ కార్యకర్తలు ముందుకు రావాలని కోరారు. అనంతరం గ్రామాల వారీగా పార్టీ కమిటీ అధ్యక్షులు, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముక్తాపురం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా అంకె పెద్ద ఓబిలేసు, మామిళ్లపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా వై.రామకృష్ణారెడ్డి, దాదులూరు గ్రామ కమిటీ అధ్యక్షుడిగా జయరామిరెడ్డిని నియమించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అమరనాథరెడ్డి, పెద్దిరెడ్డి, రమణారెడ్డి, సర్పంచులు ఓబిరెడ్డి, నారాయణ, ముక్తాపురం రామకృష్ణ, వెంకటనారాయణరెడ్డి, సూర్యశేఖర్‌రెడ్డి, వెంకటనారప్ప, జనార్దన్‌రెడ్డి, పలు గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'టెన్త్' స్పాట్‌లో వారిని మినహాయించాలి



డీఈఓ కిష్టప్పకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ధర్మవరం అర్బన్: పదో తరగతి స్పాట్ వాల్యూయేషన్‌లో పలువురు ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి కోరారు. పట్టణంలోని జిల్లా ఉప విద్యాశాఖాధికారి కార్యాలయంలో గురువారం డీఈఓ కిష్టప్పకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 3 నుంచి జరగబోయే పదో తరగతి స్పాట్ వాల్యూయేషన్‌కు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు, ఫిజికల్లీ, విజువల్లీ ఛాలెంజ్డ్ ఉపాధ్యాయులు, 58 ఏళ్లు నిండినవారు, మానసిక రుగ్మత పిల్లలున్న ఉపాధ్యాయులతో వ్యక్తిగత లెటర్లు తీసుకుని మినహాయింపు ఇవ్వాలన్నారు. ఎస్‌జీటీలకు స్పెషల్ అసిస్టెంట్ డ్యూటీలు 25 ఏళ్ల సర్వీస్ ఉండి 50 ఏళ్లు పైబడిన ఎస్‌జీటీలుగానే పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులకు స్పెషల్ అసిస్టెంట్ డ్యూటీల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. 2018 డీఎస్సీ ఉపాధ్యాయులకు స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఇచ్చిన ఆదేశాల ప్రకారమే జాయినింగ్ తేదీల వేయాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా నాయకులు రామకృష్ణనాయక్, ఆంజనేయులు, లక్ష్మయ్య, రాంప్రసాద్, మల్లేష్, అమర్‌నాథ్‌రెడ్డి, హెచ్. రామంజినేయులు, సకల చంద్రశేఖర్, సురేష్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించాలి



టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ధర్మవరం: టిడ్కో గృహాలను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎల్-4 కాలనీ సమీపంలో ఉన్న టిడ్కో గృహాలను గురువారం సీపీఎం నాయకులు జంగాలపల్లి పెద్దన్న, అయూబ్‌ఖాన్, ఆలకుంట మారుతి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడ్కో గృహాల నిర్మాణం ప్రారంభించి దాదాపు ఎనిమిదేళ్లు కావొస్తున్నా ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్నాయన్నారు. టిడ్కో గృహాల నిర్మాణంలో నాసిరకమైన సామగ్రి వినియోగించారని, కనీస సౌకర్యాలు లేవన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ఈనెల 25న జిల్లా కేంద్రం పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే నిరసన కార్యక్రమానికి లబ్ధిదారులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. చేనేత కార్మిక సంఘం నాయకులు గుంపు హరి, సీపీఎం నాయకులు వెంకటస్వామి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

నాటుసారాతో జీవితాలు నాశనం

ముదిగుబ్బ: నాటుసారాతో జీవితాలు నాశనమవుతాయని, ఎవరూ దాని జోలికెళ్లొద్దని ధర్మవరం ఎక్సైజ్ సీఐ చంద్రమణి ప్రజలకు సూచించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గురువారం గుడ్డంపల్లి తండా, ఆకుతోటపల్లి, చెర్లోపల్లి గ్రామాల్లో ప్రజలకు నాటుసారా నిర్మూలనపై అవగాహన కల్పించారు. నాటుసారా సేవించడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. నాటుసారా క్రయవిక్రయాలను చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్సైజ్ ఎస్ఐ నాగరాజు, రెవెన్యూ అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, విలేజ్ కానిస్టేబుల్ పాల్గొన్నారు.

కనగానపల్లి: ఆరోగ్యానికి హానికరమైన నాటుసారాకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలి. సారా రహిత గ్రామాలుగా గుర్తింపు పొందాలని ఎక్సైజ్, ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ నాగమదయ్య తెలిపారు, మండలంలోని వేపకుంట, భానుకోట, మద్దెలచెరువు గ్రామాల్లో గురువారం నవోదయం 2.0 కార్యక్రమంపై ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాటుసారా వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ డీపీఈఓ గోవిందు నాయక్, ఏఈఎస్ శ్రీరామ్, స్థానిక రెవెన్యూ, పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై సమావేశం



మాట్లాడుతున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం: ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ మహేష్ సమావేశం నిర్వహించారు. ధర్మవరం నియోజకవర్గంలోని ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు తదితర వాటిపై చర్చించారు. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని ఆర్డీఓ వారికి సూచించారు.

ప్రశ్నించిన వారిపై దాడి చేయడం దారుణం

పుట్టపర్తి టౌన్: జిల్లాలో కూటమి నాయకులు చేస్తున్న అన్యాయాలు, ఆక్రమణలు, దాడులపై ప్రశ్నించిన సీపీఐ నాయకులు, జర్నలిస్టులపై బీసీ సంక్షేమ శాఖా మంత్రి సవిత అనుచరులు దాడి చేయడం దారుణమని జిల్లా సీపీఐ కార్యదర్శి వేమయ్య యాదవ్ పేర్కొన్నారు. ఈమేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మంత్రి సవిత అనుచరులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని సోమందేపల్లిలో ఇష్టారాజ్యంగా మట్టిని తరలిస్తున్నారని, దీనిపై తమ పార్టీ నేతలు ప్రశ్నించడంతో దాడులకు దిగారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి నాయకులు రైల్వే పనులను అనుమతులు లేకుండా మట్టిని తరలించి సొమ్ము చేసుకొంటున్నారని ఆరోపించారు. మంత్రి నియోజకవర్గంలోనే ప్రజాసంఘాలు, జర్నలిస్టులకు రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీ వర్కర్ల శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న ఎంఈఓ సుధాకర్‌నాయక్

బత్తలపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నారులలో మేధోశక్తిని పెంపొందించేందుకు అంగన్‌వాడీ వర్కర్లకు ఇస్తున్న రెండో విడత మూడు రోజుల శిక్షణ గురువారం ప్రారంభమైంది. స్థానిక ప్రాథమిక పాఠశాలలో పోషణ భీ-పడాయి భీపై నిర్వహిస్తున్న కార్యక్రమానికి సీడీపీఓ సరస్వతి అధ్యక్షతన నిర్వహించారు. చిన్నారుల్లో అంగన్‌వాడీ స్థాయి నుంచి ఏ విధంగా విద్యాబుద్ధులు నేర్పించాలి, వారిలో మేధోశక్తిని ఎలా పెంపొందించాలో ఎంఈఓలు చాముండేశ్వరి, సుధాకర్‌నాయక్ వివరించారు. 0-6 సంవత్సరాల పిల్లల్లో మేధోభివృద్ధి 85 శాతం ఉంటుందన్నారు. పిల్లల ఎదుగుదలకు ఐదు అభివృద్ధి అంశాలను వివరించారు. అనంతరం సీఆర్పీలు ఇయర్లీ చైల్డ్ కేర్, ఎడ్యుకేషన్‌పై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దేవమణి, లలితమ్మ, మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: స్థానిక వెలుగు కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు గురువారం పోషణ్ భీ-పడాయి భీపై శిక్షణ తరగతులను నిర్వహించారు. ఏసీడీపీఓ సునంద వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఏపీఎం హేమలత, ముదిగుబ్బ, ఎనుములవారిపల్లి సెక్టార్లకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తాడిమర్రి/ బత్తలపల్లి: తాడిమర్రి, బత్తలపల్లి(సంజీవపురం) కేజీబీవీల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తాడిమర్రి పాఠశాల ప్రిన్సిపాల్ వాణిశ్రీ, బత్తలపల్లి ఎంఈఓలు ఛాముండేశ్వరి, సుధాకర్‌నాయక్ గురువారం తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 6,11 తరగతుల్లో ప్రవేశాలు, 7, 8, 9, 10, 12 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం బాలికలు ఆన్‌లైన్‌లో ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 11వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్(బడి మానేసిన వారు) పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణిస్తామని, ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మేసేజ్ ద్వారా సమాచారం అందుతుందన్నారు. సంబంధిత పాఠశాల నోటిఫికేషన్ బోర్డులో నేరుగా చూడవచ్చన్నారు.

రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



రైతులకు స్ప్రింక్లర్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: రైతులు పంటలన పండించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని టింబక్టు కలెక్టివ్ సంస్థ వ్యవస్థాపకులు మేరీ, బబ్లూ గంగూలీ సూచించారు. చెన్నేకొత్తపల్లిలోని సంస్థ కార్యాలయం వద్ద గురువారం రామగిరి, రొద్దం, చెన్నేకొత్తపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లోని 28 మంది రైతులకు ఒకొక్కక్కరికి 30 పైపులు, 5 స్ప్రింక్లర్లను పంపిణీ చేశారు. సంస్థ 75 శాతం, రైతులు 25 శాతం వాటాతో పరికరాలను అందజేయడం జరిగిందన్నారు. సంస్థ ఏడీ సుకన్య, సిబ్బంది పాల్గొన్నారు.

సొసైటీ స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడండి

ముదిగుబ్బ: ముదిగుబ్బ సొసైటీ స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం సొసైటీ సీఈఓ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీ స్థలంలో పేదలు రేకులషెడ్లను నిర్మించడంతో అధికారులు వాటిని జేసీబీలతో తొలగించారన్నారు. అయితే కొంత మంది సొసైటీ స్థలాన్ని ఆక్రమించి పెద్ద పెద్ద భవనాలు నిర్మించుకున్నా కూల్చివేతకు చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. సీపీఐ నాయకులు వెంగమేష్ చౌదరి, తిప్పయ్య, నాయుడు, చిన్నప్ప, ఈశ్వర్ నాయక్, మల్లాది లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.





బసవన్నను ఊరేగిస్తున్న జనం, గాజులు కొనుగోలు చేస్తున్న మహిళలు, రథోత్సవం ముందు యువకులు సందడి



రథోత్సవాన్ని తిలకిస్తున్న చిన్నారి



టాటూ వేయించుకుంటున్న యువకుడు

భక్త జన సందడి

కదిరి: ఖాద్రీ లక్ష్మీనరసింహుని రథోత్సవం సందర్భంగా పట్టణంలోని వీధులన్నీ భక్తులతో సందడిగా మారాయి. భక్తుల గోవింద నామస్మరణతో తిరువీధులు మార్మోగాయి. భక్తులు రథంపైకి దవణం, మిరియాలు చల్లి మొక్కలు తీర్చుకున్నారు. యువకులు రథం ముందు యువకులు సందడి చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రథోత్సవం ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.




స్వామి వారి రథోత్సవం(ఇన్‌సెట్‌లో) భక్తులకు సూచనలిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి